పశువైద్యశాలల్లో మందుల కొరత!



రామభద్రపురం పశువైద్యశాలలో పాడిఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారిణి హిరణ్య

- ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్న పాడిరైతులు

రామభద్రపురం: మండలంలోని పశువైద్యశాలలను మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో పాడి రైతులు తమ పశువులకు అవసరమైన మందుల కోసం ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామభద్రపురం, ఆరికతోట, కొట్టక్కి, పాతరేగ తదితర గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. అలాగే 17 సచివాలయాల పరిధిలోని 17 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో గొర్రెలు, పశువులకు రొటీన్‌గా వినియోగించే నాలు మందు, టీబీ పొడరు, పెయిన్ కిల్లర్స్, యాంటీ బయోటిక్స్ వంటి మందులు కూడా లేకపోవడంతో అక్కడి సిబ్బంది ప్రైవేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేసుకోవాలని చీటీలు రాసి ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పశువైద్యశాలలతో పాటు రైతు సేవా కేంద్రాలలో తమ పశువులకు అవసరమైన మందులు లభించేవని, ఇప్పుడు పూర్తిగా కొరత ఏర్పడడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని పాడిరైతులు, పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పశు సంవర్థక శాఖ ఏడీ విష్ణు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో మందుల కొరత ఉండడం వాస్తవమేనని, ఇండెంట్ పెట్టామని, 15 రోజుల్లో స్టాకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా, రామభద్రపురం పశువైద్యశాలకు పలు రోగ లక్షణాలతో సోమవారం వచ్చిన పాడిపశువులకు పశువైద్యాధికారి హిరణ్య వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగాల నివారణకు పలు సూచనలు, సలహాలు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా ‘మిలాద్ ఉన్ నబీ’



రాజాం మెయిన్‌రోడ్డులో ముస్లింల శాంతియుత ర్యాలీ

రాజాం సిటీ: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని, మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి రోడ్డులోని గాయత్రికాలనీ నుంచి శ్రీకాకుళం రోడ్డు వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, రజియె ముస్తఫా కమిటీ అధ్యక్షులు ఇమ్రాన్, నజీర్, ఫారుక్, ఇబ్రహీం, జాసీంలు మాట్లాడుతూ ముస్లింలు అంతా ఐక్యతతో ప్రపంచశాంతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సర్వమానవాళికి, ప్రపంచ శాంతికి దివ్య పురుషుడైన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీ పండగగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంటల పరిశీలన



పాతచెలికానివలసలో పంటలు పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: తుపాను కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటలను ఏవో జి.మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. మండలంలోని వెంకంపేట, పాతచెలికానివలస, కొత్తచెలికానివలస, ఆమదాలవలస తదితర గ్రామాల్లోని పంటపొలాలను అగ్రికల్చర్ అసిస్టెంట్లతో కలిసి పరిశీలించి, పంటలో చేరిన నీటిని తొలగించాలని సూచించారు. అనంతరం ఎకరాకు 15 కిలోల యూరియా జల్లాలన్నారు. ప్రస్తుతం పంటల్లోకి చేరిన నీటితో ఎటువంటి ఇబ్బంది లేదని, ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

వాహన తనిఖీలు



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ షేక్ శంకర్

వంగర: మండలంలోని మడ్డువలస, మగ్గూరు జంక్షన్‌ల వద్ద ఎస్‌ఐ షేక్ శంకర్ సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. వాహనదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలు వేగంగా నడపొద్దని సూచించారు.

రూ.77 వేల ధర పలికిన గణపతి లడ్డూ



సీతారాంను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

రాజాం: మండలంలోని నందబలగ గ్రామంలో వినాయకుని మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలంపాట సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొర్ను సీతారాం కుమారులు లక్ష్మణ, గౌరీష్‌లు రూ.77 వేలకు ఆ లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సీతారాంను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సారథి గెడ్డ బాగుచేయండి



వంజరాంపేట సమీపంలో కుదించుకుపోయిన సారథి గెడ్డ

రాజాం: పట్టణంలోని సారథి గెడ్డ ముళ్లపొదలు, ఆక్రమణలు, కలుపుమొక్కలతో కుదించుకుపోయిందని, వర్షాల సమయంలో గ్రామంలోకి నీరు వచ్చేస్తోందని వంజరాంపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కుందించుకుపోయిన గెడ్డను బాగుచేసి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరారు.

నేడు ‘స్వచ్ఛతా హి సేవ’ ర్యాలీ

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానికి సంబంధించి, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అధికారులు, మున్సిపల్ సిబ్బంది అంతా హాజరుకావాలని కోరారు.

‘గ్లకోమా’పై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

బొబ్బిలి: కంటికి సంబంధించిన గ్లకోమా వ్యాధిపై నెలకొన్న అపోహలు వీడాలని నేత్రవైద్య నిపుణుడు కేవీ అప్పారావు అన్నారు. ఇటీవల తిరుపతిలో మూడురోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సమావేశానికి హాజరైన ఆయన.. అక్కడ గ్లకోమా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై జరిగిన చర్చ ముఖ్యాంశాలను సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, వివరించారు. కంటిలోని ఆప్టిక్ నరాలపై దెబ్బకొట్టే ఒక వైద్య పరిస్థితి గ్లకోమా అని, అంధత్వం రావడానికి గల కారణాల్లో గ్లకోమా ఒక కారణమే కానీ గ్లకోమా వల్లే శాశ్వత అంధత్వం కలుగుతుందన్నది అపోహ అని స్పష్టం చేశారు. దాదాపు ఆరు వేలకు పైగా గ్లకోమా శస్త్రచికిత్సలు చేసిన అనుభవంతో తాను సీనియర్, జూనియర్ వైద్యులకు కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. గ్లకోమా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న చికిత్సా విధానాలతో పూర్తి అంధత్వం రాకుండా చూసుకోవచ్చన్నారు. ఈ చికిత్సల్లో సక్సెస్ రేటు 50 శాతం నుంచి 99 శాతం వరకు పెరిగిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సుగర్, బీపీ, గుండెజబ్బులున్న వారి చూపును గ్లకోమా త్వరగా తగ్గిస్తుందన్నారు. యాభై ఏళ్ల పైబడిన వారిలో 2 శాతం మందికి ఇది సాధారణంగా సోకుతుందన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శశికళ

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని లచ్చారాయపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. మనం రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 15 మంది ఎంపిక



పుష్పగిరి కంటి ఆస్పత్రికి బయలుదేరిన రోగులతో సిబ్బంది

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు గ్రామ పరిసర ప్రాంతాల నుంచి వివిధ కంటి సమస్యలతో శిబిరానికి హాజరైన వారికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 15 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసి, పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. పెరుమాళి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.వెంకటేష్, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ ఏవైనా కంటి సమస్యలతో బాధపడేవారు వెంటనే వైద్యులను సంప్రదించి, మందులు వాడాలని తెలిపారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కూడా వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

సాక్షి ఎఫెక్ట్...



పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

రామభద్రపురం: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్‌ఐ వి.ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొండకెంగువ ఏడొంపుల గెడ్డ నుంచి ఇసుక దోపిడీ సాగుతుండడంతో ఈ నెల 13వ తేదీన యథేచ్ఛగా ఇసుక దోపిడీ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీ వకుల్ జిందాల్ ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ నారాయణరావు, ఎస్‌ఐ ప్రసాదరావులను ఆదేశించారు. ఈ మేరకు పోలీస్ అధికారులు మూడు రోజులుగా ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో కొండకెంగువ ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నారు. ఒకటి కొండకెంగువ నుంచి ముచ్చర్లవలసకు వెళ్లే జంక్షన్‌లో తారురోడ్డు వద్ద, మరొకటి రామభద్రపురం పీహెచ్‌సీ సమీపంలో పట్టుకుని సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాల యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

దుస్తులు, నిత్యావసరాల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని మోసూరువలస గ్రామంలోని గిరిజనులకు మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యవసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులంతా మాట్లాడుతూ నిరుపేద గిరిజనులను ఆదుకోవడం తమవంతు బాధ్యతగా భావిస్తున్నామన్నారు. మైదాన ప్రాంతాలకు దూరంగా కొండలు, గుట్టలపై నివశిస్తున్న నిరుపేద గిరిజనులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కోరారు. అనంతరం మాజీ సైనికుడు ధర్మారావు ఓ గిరిజన గర్భిణికి మందుల ఖర్చుల నిమిత్తం రూ.1,116 అందజేశారు. కార్యక్రమంలో వీఎస్ శర్మ, వనమిత్ర కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత నేత్రవైద్యశిబిరం

వంగర: మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ఈ నెల 19వ తేదీన ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. స్వచ్ఛంద సేవా సంస్థతో పాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరానికి నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారంతా రావాలని, శిబిరంలో అందించనున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌ఐవీ రోగులపై చిన్నచూపు తగదు

బొబ్బిలి: హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునోవైరస్) సోకిన రోగులను చిన్నచూపు చూడవద్దని వక్తలు కోరారు. స్థానిక బాలురు వసతిగృహంలో యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు హెచ్‌ఐవీ, దాని బారి నపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఓఆర్‌డబ్ల్యూకే ఉమా మాట్లాడుతూ హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారిని సాధారణ వ్యక్తుల లాగే చూడాలని, వారిని అవమానపరిచే వ్యాఖ్యలు చేయవద్దన్నారు. హెచ్‌ఐవీ రోగులను అవమానానికి గురిచేసే వ్యక్తులపై చర్యలు తీసుకునే చట్టాలను వివరించారు. అనంతరం హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

చెరకు క్రషింగ్‌కు సన్నాహాలు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చాటాయివలస, కొమెర, అంబకండి, ఉంగరాడ, వన్నలి, రేగిడి, ఆమదాలవలస తదితర గ్రామాల్లోని చెరకు పంట క్రషింగ్‌కు యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. తొలుత పంటలను పరిశీలించి, పక్వానికి వచ్చిన చెరకు కటింగ్‌కు సంబంధించి, ఆర్డర్లు ఇస్తామని సిబ్బంది తెలిపారు.

అన్నదానం

వంగర: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కోనంగిపాడు, కె.కొత్తవలస తదితర గ్రామాల్లోని గణేశుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరి



రాజాం: ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, తదితరులు



రాజాం సిటీ: ఏచూరికి జోహార్లు చెబుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

రాజాం: కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కొనియాడారు. సోమవారం స్థానిక పట్టణంలోని రైస్‌మిల్లు వద్ద రాజాం రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, కార్మిక, రైతు వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నిత్యం పోరాటం సాగించిన వ్యక్తి ఏచూరి అని, ఆయన సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి, విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పోరెడ్డి విశ్వనాథం, కార్యదర్శి కంచినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి..

రాజాం సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ ఏచూరి సీతారాం సేవలు మరువలేనివని సీపీఎం మండల కన్వీనర్ సీహెచ్ రామ్మూర్తినాయుడు కొనియాడారు. మండల పరిధిలోని రాజయ్యపేటలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి మృతి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటన్నారు. మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి, విప్లవ శక్తులను కొత్తపుంతలు తొక్కించడానికి విరామమెరుగని కృషి చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో 2011లో రెడ్డీస్ లేబరేటరీ కార్మికుల 100 రోజుల పోరాటానికి ప్రత్యక్షంగా సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యారావు, శ్రీనివాసరావు, తవుడు, సురేష్, లక్ష్మీపార్వతి, అపర్ణ, శంకరరావు, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి



మృతుడు సత్యం



సత్యం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండల మాజీ వైస్ ఎంపీపీ చింత సత్యనారాయణ(సత్యం) సోమవారం మృతి చెందారు. మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన ఆయన కొన్నేళ్ల పాటు సర్పంచ్ గాను, మండల వైస్ ఎంపీపీగా 1990 నుంచి 1995 వరకు పనిచేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆ గ్రామానికి వెళ్లి, సత్యం మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన మృతి గ్రామానికి తీరనిలోటు అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పోరాటయోధుడు బొజ్జా తారకం



బొజ్జా తారకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: గొప్ప పోరాటయోధుడు బొజ్జా తారకం అని బీఎస్పీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.బుద్ధుడు కొనియాడారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బొజ్జా తారకం వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులంతా కలిసి తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుదీర్ఘకాలం పాటు పీడిత ప్రజలు, దళితుల పక్షాన ఆయన పోరాటం చేశారన్నారు. చుండూరు, కారంచేడు, లక్ష్మీపేట వంటి ఘటనల్లో దళితుల పక్షాన అలుపెరగని పోరాటం చేసి, న్యాయం జరిగేందుకు తోడ్పడ్డారన్నారు. కార్యక్రమంలో జె.నీలయ్య, తవిటయ్య, పాపారావు, అన్నారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి హాజరైన 35 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యం గొప్పతనం, ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, ఏఎన్‌ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వినాయక నిమజ్జనోత్సవం



రాజాం: విద్యానగర్‌లోని వినాయక మండపం వద్ద భక్తుల పూజలు

బాడంగి/సంతకవిటి/రాజాం: మండలాల్లోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం విగ్రహ ఊరేగింపు చేపట్టారు. ప్రతిమ తిరువీధి సమయంలో డీజే పాటలకు యువతీయువకులు చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.



బాడంగి మెయిన్‌రోడ్డు మీదుగా గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



బాడంగి: ఆకట్టుకున్న మహిళల కోలాటం

• సన్మానం



రాజాం సిటీ: గౌరీకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజాం/రాజాం సిటీ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వాండ్రంగి గౌరీకుమార్, గొర్లె నారాయణరావులను పూర్వ విద్యార్థులు సోమవారం ఘనంగా సత్కరించారు. రెండు దశాబ్దాల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు గౌరీకుమార్ పదవీ విరమణ అవుతున్న విషయం తెలుసుకుని, వారంతా ఇలా సన్మానించి, తమ గురుభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.కృష్ణారావు, వి.రాజ్యలక్ష్మి, అచ్యుత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.